
క్లుప్తంగా

15న 'సిందూరం' పరిచయ సభ



పుస్తక ముఖ చిత్రం

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ కవులు ఉన్నం వెంకటేశ్వర్లు – ఉష రచించిన ×సిందూరం× పుస్తక పరిచయ సభ ఈ నెల 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు కొత్త బస్టాండ్ సమీపంలోని కేకే భవన్‌లో జరుగుతుందని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు తెలిపారు. కార్ల్‌మార్క్స్ కాపిటల్ గ్రంథానికి కవిత్వ రూపంలో వచ్చిన ఈ పుస్తక పరిచయ సభలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి బి.ప్రసాదమూర్తి, ప్రధాన వక్తలుగా డాక్టర్ బ్రహ్మారెడ్డి, జి.వెంకట కృష్ణ, పానుగంటి చంద్రయ్య, ఆవుల బసప్ప, కెంగార మోహన్ వక్తలుగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయరాదని కోరుతూ గురువారం ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లుకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 8 నెలల జీతాలు చెల్లించాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఈశ్వర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పీఆర్ క్యూసీ-2 డీఈఈగా ధనిబాబు


ధనిబాబు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ -2 డీఈఈగా జీ.ధనిబాబు జిల్లా పరిషత్‌లోని క్యూసీ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు ఇక్కడ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న హెచ్‌డీ ఈరన్న నందికొట్కూరు పీఆర్‌కు బదిలీ కాగా, నందికొట్కూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేస్తున్న ధనిబాబును క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ చేశారు. క్యూసీ -2 పరిధిలోకి పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాలు వస్తాయి. ఈ నియోజకవర్గాల పరిధిలో పీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల క్వాలిటీని క్యూసీ -2 డీఈఈ పర్యవేక్షించాల్సి ఉంటుంది.

హెచ్‌సీ కుటుంబానికి చేయూత

కర్నూలు: మూర్ఛ వ్యాధికి గురై కొన్ని నెలలుగా చికిత్స పొందుతూ కోలుకోలేక కోమా స్థితికి చేరిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కుటుంబానికి సహోద్యోగులు చేయూతనందించారు. శ్రీనివాసులు ప్రస్తుతం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యం బారిన పడ్డాడు. కర్నూలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం కుటుంబ సభ్యులు దాదాపు రూ.10 లక్షలు ఖర్చు పెట్టినా నయం కాకపోగా కోమాలోకి వెళ్లాడు. దీంతో 1996 బ్యాచ్ పోలీసులు వారి జీతాల్లో నుంచి సుమారు రూ.1.10 లక్షలు పోగు చేసి కర్నూలు బిర్లా గడ్డలోని నివాసానికి వెళ్లి శ్రీనివాసులు కుటుంబానికి నగదు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

హంస అవార్డు గ్రహీతకు సన్మానం

కర్నూలు కల్చరల్: ఉగాది పురస్కారం హంస అవార్డుతో పాటు ఎన్టీఆర్ అవార్డు అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యను బిట్స్ విద్యాసంస్థల నిర్వాహకులు గురువారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా సన్మానించారు. విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు, ముద్రికా ప్రింటర్స్ అధినేత భాస్కర్, విశ్రాంత అధ్యాపకులు బీవీ మాధవరావు, ప్రొఫెసర్ జయశంకర వరప్రసాద్, అధ్యాపకులు ఆకుల శీనుబాబు తదితరులు ఉన్నారు. కళారంగాలో విశేష సేవలు అందిస్తూ పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్న ఓబులయ్యను సన్మానించినట్లు చైర్మన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఆరోగ్యానికి దివ్యౌషధం యోగా

కర్నూలు కల్చరల్: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందానికి యోగా ఎంతగానో సహకరిస్తుందని రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు అన్నారు. యోగాంధ్రలో భాగంగా గురువారం వర్సిటీ ఇండోర్ స్టేడియంలో యోగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ శిక్షకులు జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.శ్రీనివామూర్తి యోగా ప్రాధాన్యతను వివరించారు. వర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య భరత్‌కుమార్, యోగా కోఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కిట్ల పంపిణీ

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ సూచించారు. స్థానిక నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న కిట్ల పంపిణీ కార్యక్రమానికి డీఈఓ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువుల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. సన్న బియ్యంతో చేసిన భోజనాన్ని వడ్డించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కర్నూలు అర్బన్ ఎంఈఓ విజయలక్ష్మి, హెచ్‌ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


బి.క్యాంప్ మున్సిపల్ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు


ప్రార్థన చేస్తున్న విద్యార్థులు


ఇందిరా మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థులను చేర్చుకుంటున్న దృశ్యం

మోగిన బడి గంట

వేసవి సెలవులు ముగిసిన అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో చిన్నారులు ఉత్సాహంగా పాఠశాలలకు బయలుదేరారు. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులే స్వయంగా చిన్నారులను తీసుకొచ్చి పాఠశాలల్లో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా విద్యా సామగ్రి విక్రయించే దుకాణాలు, బ్యాగ్‌ల షాపులు కిటకిటలాడాయి. ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రార్థన, ప్రతిజ్ఞ చేయించి తరగతులు ప్రారంభించారు. చాలా రోజుల తర్వాత మిత్రులను కలుసుకోవడంతో విద్యార్థుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఉపాధ్యాయులు అంతంత మాత్రంగానే హాజరవడంతో విద్యార్థులు ఆడుతూపాడుతూ సరదాగా గడిపారు. దాదాపు అన్ని పాఠశాలల్లో తొలిరోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


చిన్నారికి బడికి తీసుకెళ్తున్న తల్లి


ఎ.క్యాంప్‌లోని ఇందిరా మెమోరియల్ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు



బ్యాగ్‌లను కొనుగోలు చేస్తున్న దృశ్యం, సి.క్యాంప్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో తరగతుల ప్రారంభం

ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ అల్పాహారం



ఉపాధ్యాయులకు అల్పాహారం ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు (సిటీ): కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాల ఆవరణలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ కేంద్రంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉచిత అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గురువారం నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.కరుణానిధి మూర్తి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రిపూట ఉపాధ్యాయులు ఇబ్బందులు పడకుండా అల్పాహారాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఈఓ జనార్ధన్ రెడ్డి అన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులకు, వారి బంధుమిత్రులకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, వీరారెడ్డి నాగేశ్వరయ్య, జిల్లా నాయకులు ఆంజనేయ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువన్నీ అబద్ధాలే

- ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు


మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఏడాది పాలనలో ఆయన ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం విమర్శించారు. గురువారం నగరంలోని ప్రకాష్‌నగర్, ధర్మపేట, కారల్‌మార్క్స్ నగర్, జనార్ధనరావు నగర్, చదువుల రామయ్య నగర్, బద్రీనాథ్ నగర్‌లకు సంబంధించి సంయుక్త మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో అరచేతిలో వైకుంఠం చూపి ఇప్పుడు డబ్బులు లేని చెప్పడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సొంతిల్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని చెప్పి మాట తప్పిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కర్నూలు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచాలని, రోడ్లను విస్తరించాలని, పేద, మధ్య తరగతి వర్గాల కోసం నిర్మించిన టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం ఆయా శాఖల సెక్రటరీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నల్లన్న, రంగన్న, నాగరత్నమ్మ, ధర్మన్న, ఖాదర్‌బాషా, కుమార్‌రాజా, దంబోళం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మోదీ ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయిల్ అండ్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ రేట్ల పెంపుదలలో భాగంగా ఈ సంవత్సరం 11 శాతం పెంచినట్లు చెప్పారు. ఇది ఆయిల్, రైస్ మిల్లు కార్మికులు పోరాడి సాధించుకున్న విజయమని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. అలాగే నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా జూలై 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాయిబాబా, శాలన్న, హనుమంతు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

కర్నూలు (టౌన్): బాల బాలికల హక్కులను కాపాడటం మన అందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక నైస్ కంప్యూటర్ సంస్థ కార్యాలయంలో నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా బాల కార్మికులు ఎదుర్కొంటున్న మానసిక, శారీరక సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను బాల కార్మికులుగా పంపించడం నిషేధమన్నారు. పిల్లలకు విద్యా హక్కు, ఆరోగ్య హక్కులను కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నుంచి చిన్నారులకు విముక్తి కలిగించేలా ప్రయత్నం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, మెల్విన్ జోన్స్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన అధికారులు


జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణను అభినందిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ అనుబంధ శాఖల్లో బదిలీలో భాగంగా కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కే.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన వారు. కర్నూలులోనే విద్యాభ్యాసం సాగింది. గుంటూరులోని ఉద్యాన శాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు పీడీగా బాధ్యతలు స్వీకరించారు. నూతన పీడీని ఉద్యాన శాఖ ఏడీ రామాంజనేయులు, పలువురు ఉద్యాన అధికారులు, ఏపీఎంఐపీ సిబ్బంది అభినందించారు.

- సహకార శాఖ జిల్లా అధికారిగా వెంకటకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడలో డీసీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కర్నూలుకు వచ్చారు. ఈయన ఇది వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు పోస్టుల్లో పనిచేశారు. నూతన డీసీఓను జిల్లా సహకార అధికారులు సత్కరించారు
- జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారిగా ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లాలో పని చేస్తూ మెడికల్ గ్రౌండ్స్ కింద ఇక్కడికి బదిలీ అయ్యారు
- చేనేత, జౌళిశాఖ జిల్లా కార్యాలయంలో చేనేత అభివృద్ధి అధికారిగా వెన్నపూస నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈయన విజయవాడ చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యాలయంలో పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు.

మళ్లీ మురుగు సమస్య


అశోక్‌నగర్ అండర్ బ్రిడ్జి వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని అశోక్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగు సమస్య మళ్లీ మొదటికొచ్చింది. వర్షపు నీరు భారీగా చేరుకొని స్థానికవాసులు, వాహనాదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్య చాలా కాలంగా ఉంది. దీనిపై స్పందించిన మంత్రి టీజీ భరత్ రూ.25 లక్షలు వెచ్చించి డ్రైనేజీ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు.

అయితే సకాలంలో పూర్తి కాకపోవడంతో పాటు పనుల్లో జాప్యం జరుగుతోందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మళ్లీ అదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పడంతో మంత్రి కమిషనర్ రవీంద్రబాబుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పనులను పరిశీలించిన కమిషనర్

మంత్రి అసంతృప్తి వ్యక్తం చేయడంతో స్పందించిన కమిషనర్ రవీంద్రబాబు గురువారం సాయంత్రం డీఈఈ, ఏఈఈ, కాంట్రాక్టర్‌తో కలిసి పనులను పరిశీలించారు. అత్యవసర పనిగా భావించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షపు నీటిని మోటార్ల ద్వారా తొలగించారు. నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని, సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా పనులు చేపట్టినట్లు కమిషనర్ వెల్లడించారు. పనులు పూర్తయ్యే కాలనీవాసులు సహకరించాలని కోరారు. అయితే ఇక్కడి వారు మురుగు కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, వాటిని తొలగించడంలో, నోటీసులు ఇవ్వడంలో పట్టణ ప్రణాళిక విభాగం స్పందించకపోవడంతోనే ఈ సమస్య వస్తోందన్న విమర్శలు ఉన్నాయి.

బదిలీ మార్గదర్శకాలు విడుదలయ్యేనా?

- తీవ్ర నిరాశలో రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అన్ని శాఖల్లో సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తైనా రిజిస్ట్రేషన్ శాఖలో మాత్రం బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటివరకు బదిలీల మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో ఆ శాఖ ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. అసలు బదిలీలు జరుగుతాయా? లేదా? అన్న ఆలోచనలో పడిపోయారు. మొదట జూన్ 9న బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు వస్తాయని చెప్పినా విడుదల కాలేదు. తిరిగి జూన్ 13న మార్గదర్శకాలు విడులవుతాయన్న ఆశతో ఉన్నారు. అయితే ఏమి జరుగుతుందో తెలియకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. మరోవైపు బదిలీలు జరిగితే సొంత ప్రాంతాలు, అనారోగ్యం బారిన పడిన వారు కుటుంబాలకు దగ్గర అవ్వడం, వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తున్న భార్యభర్తలు ఒకచోటికి చేరడం, దూరప్రాంతాల్లో ఉన్న వారు సొంతూర్లకు దగ్గరగా వెళ్లడం కోసం మార్గదర్శకాలు వస్తే దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే మార్గదర్శకాల విడుదలపైనే మీమాంస నెలకొనడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

షుగర్ వ్యాధిపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): ఆధునిక సమాజంలో ప్రతి ఇంట్లో ఒకరికి షుగర్ ఉంటోందని, ఈ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకోవాలని కన్సల్టెంట్ డయాబెటాలజిస్టు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సి.గోపీనాథ్ రెడ్డి చెప్పారు. జాతీయ మధుమేహ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల కలిగే మెటబాలిక్ వ్యాధి ఇది అని తెలిపారు. ఆరోగ్య రంగానికి ఈ వ్యాధి పెనుసవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. కుటుంబంలో ఎవ్వరికైనా వ్యాధి ఉండటం, వయస్సు పెరుగుదల, అధిక బరువు, జీవనశైలిలో మార్పులు, పౌష్టికాహారం లేకపోవడం, పొగతాగే అలవాటు, మద్యపానం ఈ వ్యాధికి కారణాలని తెలిపారు. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెప్పారు.

123 మంది ఏఏఓలు, ఎస్‌ఏలు బదిలీ

కర్నూలు (అగ్రికల్చర్): స్టేట్ ఆడిట్ (లోకల్ ఫండ్) నాల్గవ జోన్ పరిధిలో భారీ ఎత్తున బదిలీలు జరిగాయి. స్టేట్ ఆడిట్ కర్నూలు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందప్ప బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. కర్నూలు ఆర్‌డీడీ పరిధిలో 8 జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాలకు సంబంధించి 123 మంది అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు (ఏఏఓ), సీనియర్ ఆడిటర్లు (ఎస్‌ఏలు) బదిలీ అయ్యారు. బదిలీలను ఆర్థిక శాఖ అధికారి చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టారు. 23 మంది అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు, 90 మంది సీనియర్ ఆడిటర్లు బదిలీ అయ్యారు. ఐదేళ్లు నిండిన వారందరూ బదిలీ కాగా రిక్వెస్ట్‌పై మరికొందరిని వారు ఆప్షన్ ఇచ్చిన ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియను మార్గదర్శకాలకు లోబడి పూర్తి చేసినట్లు ఆర్‌డీడీ గోవిందప్ప పేర్కొన్నారు.

మహాత్మా మన్నించు!


స్కూల్ స్టోర్ రూమ్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం

కర్నూలు (సిటీ): కర్నూలు నగరంలోని నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో మహాత్మాగాంధీ విగ్రహాన్ని గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఆ విగ్రహాన్ని ఎప్పుడు? ఎందుకు తొలగించారో? తెలియదు కానీ ప్రస్తుతం ఆ స్కూల్ స్టోర్ రూమ్‌లో ఉంచారు.

శ్మశాన వాటిక స్థలంలో ఇళ్ల పట్టాలా?


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): మంత్రాలయం మండలం చెట్నేహళ్లి గ్రామంలోని శ్మశాన వాటికలో ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన పట్టాలు, పొషిషన్ సర్టిఫికెట్లను రద్దు చేయాలని వీహెచ్‌పీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు టి.ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ నాయకులు గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 400 ఏళ్లుగా ఉన్న శ్మాశన వాటికలో ఇళ్ల కోసం పట్టాలు ఇచ్చిన మంత్రాలయం తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాలు పొందిన వారు మృతదేమాల ఖననాన్ని అడ్డుకుంటున్నారని, వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు కలుగజేసుకొని గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు నెలకొనకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏఓ ఐ.విజయశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు శివ సాయినాథ్, సురేష్, బాబురావు, చెట్నేహళ్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'లో కోత సిగ్గుచేటు



మాట్లాడుతున్న రంగప్ప, అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్): చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు అమల్లోకి వచ్చేసరికి రూ.2 వేలు తగ్గించడం సిగ్గుచేటని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మండిపడ్డారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకానికి సవాలక్ష నిబంధనలు విధించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేల లోపు ఉండాలని, రైస్ కార్డు ఉండాలని, ఫ్యామిలీకి 3 మాగాని మూడెకరాలు, పొడి భూమి పదెకరాలు, రెండు కలిపి పదెకరాలకు మించి ఉండరాదని, ట్యాక్సీ, ట్రాక్టర్, ఆటో సహా ఎలాంటి ఫోర్ వీలర్ ఉండరాదని, కరెంట్ బిల్లు నెలకు రూ.300 దాటరాదని, విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం ఉండాలని షరతులు పెట్టడం అన్యాయమన్నారు. ఈ షరతుల ద్వారా సగం మంది ఈ పథకానికి దూరమవుతారని వాపోయారు. మరోవైపు పథకం వర్తించిన వారికి రూ.2 వేలు కోత పెట్టి ఇవ్వడం అన్యాయమన్నారు. మొత్తంగా సాంకేతిక సమస్యలతో పథకాలను ఎగ్గొట్టాలని చూస్తున్నట్లు ప్రభుత్వ తీరు ఉందన్నారు. నగర కార్యదర్శి సాయి ఉదయ్ పాల్గొన్నారు.

14 నుంచి ఒలింపిక్స్ డే వేడుకలు

కర్నూలు (టౌన్): ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఒలింపిక్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. చెస్, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, తైక్వాండో, కరాటే, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, జుడో, షూటింగ్ బాల్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, సిలంబం, కబడ్డీ, యోగాసన, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, త్రో బాల్ స్కే మార్షల్ ఆర్ట్స్, వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా క్రీడాంశాలకు సంబంధించి క్రీడాకారులు తమ పేర్లను క్రీడా సంఘాల ప్రతినిధులకు తెలియజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 99081 96883 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అందరాయం ఉంటుందని, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మంగ్లీబాయిపై దుష్ప్రచారం తగదు

కర్నూలు(అర్బన్): భగవంతుడు తనకిచ్చిన స్వరంతో జానపద, భక్తిసుధ, సినిమా రంగంలో పాటలు పాడి గుర్తింపు తెచ్చుకున్న మంగ్లీబాయిని అవమానించిన తెలంగాణ పోలీస్, ఎక్సైజ్ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కై లాస్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మంగ్లీబాయి పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఓ రిసార్ట్‌లో జరుపుకుంటున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేశారని, ముందస్తు సమాచారం లేకుండా పోలీస్, ఎక్సైజ్, యూట్యూబ్ చానల్స్ వారు వచ్చి ఫొటోలు, వీడియోలు తీశారన్నారు. వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన వారిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటన వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోని లంబాడీ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా చానెల్స్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలను వెంటనే తొలగించాలన్నారు.

14న ఈత పోటీలు

కర్నూలు (టౌన్): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 14న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో పాఠశాలల విద్యార్థులకు ఈత పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కేతు జగదీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన ఈత క్రీడాకారులకు ఈనెల 23న నిర్వహించే ఒలింపిక్ రన్ డే ఉత్సవాల్లో పతకాలు అందించనున్నట్లు వెల్లడించారు.